బడ్జెట్ ప్రతిపాదనలు ఏవీ..?

-రూపకల్పనలో హెచ్ఒడిల నిర్లక్ష్యం
-అధికారుల మధ్య సమన్వయ లోపం
-ఝార్ఖండ్ ఎన్నికల పరిశీలకునిగా వెళ్ళిన ఇలంబర్తి
-కమిషనర్ వచ్చాకే బడ్జెట్‌పై మీటింగ్ జరిగే అవకాశం

హైదరాబాద్, నవంబర్ 16,ప్రభాతవార్త: బడ్జెట్ రూపకల్పన అధికారులతో సమావేశం జీహెచ్ఎంసీ బడ్జెట్ రూపకల్పనలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. ఇంతవరకు బడ్జెట్ కు సంబంధించిన ప్రతిపానదలు పంపించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా విభాగాలకు సంబంధించిన ప్రతిపాదనలు, ఖర్చులకు సంబంధించిన వివరాలు ఇవ్వడానికి అధికారులు ముందుకు రావాడంలేదని ప్రచారం జరుగుతున్నది. ముఖ్యంగా ఇంజినీరింగ్ విభాగంలో జోన్లవారీగా ప్రతిపాదనలు ఇవ్వాలని సంబంధిత సూపరింటెండెంట్ ఇంజినీర్లను అడిగితే ఇంతవరకు ఇవ్వకపోవడంతో సదరు అధికారులకు మెమోలు జారీచేసినట్టు తెలిసింది. ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపం, కమిషనర్ ఇలంబరితి ఝార్ఖండ్ ఎన్నికల పరిశీలకులుగా ఉండటం, ఈ నెల 23తర్వాతే తిరిగి హైదరాబాద్‌కు వచ్చే పరిస్థితులు కనబడుతున్నాయి. ఇంజినీరింగ్, అడ్వర్‌టైజ్ విభాగం, రవాణా, యూబీడీ, హెల్త్ వంటి విభాగాల నుంచి ప్రతిపాదనలు జీహెచ్ఎంసీ ఫైనాన్స్ విభాగానికి చేరలేదని తెలుస్తోంది. నిర్ణీత వ్యవధిలో బడ్జెట్ రూపకల్పన, ఆమోదం ఈ క్రమంలోనే వచ్చే ఏడాది జనవరి 10లోపు బడ్జెట్ ఆమోదం పొందడం కష్టసాధ్యమేనని అధికారులు భావిస్తున్నారు. వాస్తవానికి అక్టోబర్‌లోనే బడ్జెట్ అంచనాలు రూపకల్పనపై కసరత్తును ప్రారంభించాలి. జీహెచ్ఎంసీ చట్టం 1955 ప్రకారం కార్పొరేషన్ బడ్జెట్ అంచనాలను ఈ నెలలో బడ్జెట్ అంచనాలు, ప్రతిపాదనలపై కమిషనర్ నుంచి వివరణాత్మక సమాచారం స్టాండింగ్ కమిటీ ముందుకు రావాల్సి ఉంది. డిసెంబర్ 15వ తేదీలోపు వార్షిక బడ్జెట్ అంచనాలు స్టాండింగ్ కమిటీ ఆమోదించాలని చట్టం పేర్కొంటుంది. వచ్చే ఏడాది జనవరి 10 లోపు జనరల్‌బాడి మీటింగ్‌లో సభ్యుల ముందు చర్చ పెట్టి ఆమోద ముద్ర పొందాల్సి ఉంటుంది. మార్పులు, చేర్పుల అనంతరం ఫిబ్రవరి 20లోపు అంచనాలను మంజూరు చేయాల్సి ఉంటుందని చట్టం చెబుతున్నది. మార్చి 1లోపు కార్పొరేషన్ బడ్జెట్ అంచనాల సమాచారాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలి. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా కనబడుతున్నాయి. కొన్ని శాఖల ఆర్థిక విభాగానికి ప్రతిపాదనలు సమర్పించలేదు. బడ్జెట్ ప్రతిపాదనకు తొలుత స్టాండింగ్ కమిటీలో అనుమతి పొందాలి. కమిషనర్ వచ్చిన తర్వాతే స్టాండింగ్ కమిటీ సమావేశం ఉంటుంది. బడ్జెట్‌పై మార్పులు, చేర్పులు, అనంతరం స్టాండింగ్ కమిటీ ఆమోదానికి కనీసం 20 రోజుల సమయం తీసుకోనుంది. ఆ తర్వాత జనరల్ బాడి సమావేశం తేదీని ప్రకటించడం, కనీసం 15 రోజుల ముందు కార్పొరేటర్ సభ్యులకు బడ్జెట్ ప్రతిపాదనలను అందజేయాల్సి ఉంటుంది. జనరల్ బాడి సమావేశంలో సుదీర్ఘంగా చర్చించడం, సభ్యుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని మళ్లీ అవసరమైన మార్పులు, చేర్పుల అనంతరం బడ్జెట్ అనుమతికి ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. దీంతో వచ్చే జనవరి రెండో వారం లోపు బడ్జెట్ ఖరారు అయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.హౌసింగ్,జీహెచ్ఎంసీ బడ్జెట్ కలిపితే కొన్నేండ్లుగా పెరుగుతూ వస్తున్నది. 2021-22 లో బడ్జెట్ అంచనాలు రూ.5600 కోట్లు, 2022-23 లో బడ్జెట్ అంచనాలు రూ. 6,150 కోట్లు, 2023-24లో బడ్జెట్ అంచనాలు రూ. 6,224 కోట్లు, 2024-25లో రూ. 7,937 కోట్లు అంచ నాతో బడ్జెట్ రూపొందించింది. అయితే 2025-26 వార్షిక బడ్జెట్ అంచనాలు దాదాపు రూ. 8500 కోట్ల వరకు ఉండే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.

హైదరాబాద్ వార్త

కుటుంబ సర్వే తప్పులు లేకుండా డేటా ఎంట్రీ చేపట్టాలి

-శిక్షణా కార్యక్రమంలో నోడల్ అధికారి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్, నవంబర్ 16,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాతక్మంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా నమోదును ఎలాంటి తప్పులు లేకుండా బాధ్యతాయుతంగా పక్కగా నమోదు చేయాలని శిక్షణకు హాజరైన డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రాష్ట్ర నోడల్ అధికారి, హైదరాబాద్ జిల్లా అనుదీప్ దురిశెట్టి సూచించారు. ఈమేరకు శనివారం హైదరాబాద్ షేక్ పేట నారాయణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు చేపట్టిన శిక్షణా శిబిరంలో డేటా ఎంట్రీ నమోదు విధివిదానాలపై కలెక్టర్ వివరించారు. అనంతరం సిసిజీ డేవలపర్ జెల్ల లోకేష్, సిజిజి సిబ్బంది డేటా ఎంట్రీ ఆపరేటర్లకు నమోదు చేసిన ఫారంల ద్వారా శిక్షణలో క్షుణ్ణంగా అవగాహనా కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి జిల్లాకు ఎంట్రీ నమోదుకు లాగిన్ ఇవ్వడం జరుగుతుందని, ఇక్కడ శిక్షణ పొందిన టివోటిఎస్‌లు జిల్లాలోని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ అందించేందుకు ఈ శిక్షణ ఎంతో కీలకమని అన్నారు. ఈ శిక్షణలో వివిధ జిల్లాలు, జిహెచ్ఎంసి నుండి దాదాపు 300 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు. వీరు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 20 వేల మందికి డేటా ఎంట్రీ ఆపరేటర్లకు మెరుగైన శిక్షణ అందించనున్నారని తెలిపారు. డేటా ఎంట్రీ బాధ్యతాయుతంగా తప్పులు లేకుండా పక్కాగా చేపట్టాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 50 శాతం పైగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరిగిందని, అలాగే కొన్ని జిల్లాలో 70 శాతం వరకు సర్వే జరిగినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో ఎన్యూమనేటర్లకు ప్రజలు సహకరిస్తున్నారని సర్వే వేగవంతంగా జరుగుతుందని అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో అర్థ గణాంక శాఖ సంచాలకులు ఓం ప్రకాష్, ప్రణాళిక శాఖ సంచాలకులు రూఫస్ దత్తం, సీసీజీ ప్రాజెక్టు మేనేజర్ జెల్ల లోకేష్ లోకేష్, ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

మెట్రో సెకండ్ ఫేజ్ భూసేకరణకు గ్రీన్ సిగ్నల్

- మెట్రో రైల్ సెకండ్ ఫేజ్ భూసేకరణకు పడిన మరో అడుగు

హైదరాబాద్, నవంబరు 16 ప్రభాతవార్త నగరంలో మెట్రో రైల్ సెకండ్ ఫేజ్ భూసేకరణకు మరో అడుగు పడింది. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణ గుట్ట వరకు చేపడుతున్న 7.5 కిలోమీటర్ల మెట్రో మార్గానికి కావల్సిన భూసేకరణ డిక్లరేషన్‌కు కలెక్టర్ ఆమోదం తెలిపారు. దీంతో ఓల్డ్ సిటీ మెట్రో రైల్ భూసేకరణ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ రూట్లో రోడ్ల విస్తరణ, స్టేషన్ల నిర్మాణానికి భూములు సేకరించనున్నారు. భూసేకరణకు ఇప్పటికే హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ నోటీసులిచ్చింది.సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మెట్రో ఫేస్ 2 కారిడార్ ఎంజిబిఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు దాదాపు 200 పైగా ఆస్తులకు డిక్లరేషన్ ఇచ్చింది. శనివారం ఆస్తుల సేకరణ డిక్లరేషన్‌కు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిషెట్టి ఆమోదం తెలిపారు. ఆస్తుల సేకరణ పూర్తయితే డిసెంబర్‌లో అవార్డు ఆమోదం జరుగు తుందని కలెక్టర్ తెలిపారు. 2025 జనవరిలో మెట్రో రైలు పనులు ప్రారంభమవుతాయని కలెక్టర్ తెలిపారు.కాగా, మెట్రో రెండో దశలో నిర్మించబోయే 76.4 కి.మీ మార్గానికి మొత్తం అంచనా వ్యయం రూ.24,269 కోట్లు, అందులో 30 శాతం అంటే 7,313 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం, 18 శాతం అంటే రూ.4,230 కోట్లు కేంద్ర ప్రభుత్వం వెచ్చించనుంది. 52 శాతం నిధులను రుణాలతో పాటు పీపీపీ విధానంలో సమకూర్చుకునేలా ప్రభుత్వం డిపిఆర్ సిద్ధం చేసి ఆమోదం తెలిపింది. రెండో దశలో ప్రభుత్వం ఐదు కొత్త కారిడార్‌లు ప్రతిపాదించింది. నాలుగో కారిడార్ నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టు వరకు (36.8కి.మీ), ఐదో కారిడార్ రాయదుర్గ్ నుంచి కోకాపేట నియోపొలిస్ వరకు (11.6కి.మీ), ఆరో కారిడార్ ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణగుట్ట వరకు (7.5కి.మీ), ఏడో కారిడార్ మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు (13.4 కి.మీ), ఎనిమిదో కారిడార్ ఎల్‌బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు (7.1కి.మీ). ప్రస్తుతం మెట్రోలో రోజుకు సుమారు 5లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. రెండో దశ మెట్రో రైల్ అందుబాటులోకి వస్తే నగరంలో రోజుకు మరో 8లక్షల మంది ప్రయాణించే అవకాశం ఉంది.

నాణ్యతలేని ఆహారం ఇస్తున్నారంటూ విద్యార్థుల ఆందోళన

-అధికార్ల దృష్టికి తీసికెళ్లినా స్పందించలేదని విద్యార్థుల ఆరోపణ
-వార్డెన్,ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలంటూ నినాదాలు

బేగంపేట నవంబరు 16,ప్రభాతవార్త : సికింద్రాబాద్ పీజీ కళాశాల హాస్టల్ వద్ద శనివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.రాత్రి మిగిలిపోయిన ఆహారాన్ని విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌గా ఇస్తున్నారని.శుక్రవారం రాత్రి పాడైపోయి, మాడిపోయిన అన్నాన్ని విద్యార్థులకు వడ్డిస్తున్నారని,ఇది తిన్న కొందరు అస్వస్థతకు గురయ్యారంటూ శనివారం పీజీ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు బైఠాయించి నిరసన తెలియజేసారు.గతంలో కూడా పలుమార్లు ఇలాగే ఫుడ్ ఫాయిజన్ అయిందని,ఈ విషయాన్ని అప్పటి నుంచి అధికారుల దృష్టికి తీసికెళుతున్నామని,వారి నుంచి ఎలాంటి స్పందన లభించడంలేదని విద్యార్థులు ఆరోపించారు.శనివారం ఉదయం గం 9ల నుంచి గం 11ల పాటు విద్యార్థులు కళాశాల ఆవరణలో ఆందోళన నిర్వహించారు.సమాచారం అందుకున్న నార్త్‌జోన్ అడిషినల్ డీసీపీ అశోక్ ,బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణ మూర్తి,ఇన్స్‌పెక్టర్ చిర్రరామయ్య, ఎస్సైజె. నర్సింగరావు లు పోలీసులతో ఆ ప్రాంతానికి చేరుకున్నారు.విద్యార్థులను సమస్యలు అడిగి తెల్సుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తాము హాస్టల్‌లో వసతుల లేమితో పాటు నాణ్యత లోపించిన ఆహార పధార్థాలు అందిస్తున్నారంటూ అధికార్లకు ఫిర్యాదు చేసినా వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు.తాజాగా మరోసారి ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. వెంటనే యూనివర్శిటీ అధికారులు హాస్టల్ ను సందర్శించి హాస్టల్ లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని,నాణ్యమైన ఆహారాన్ని అందించాలని వారు డిమాండ్ చేసారు.సంఘటనా స్థలానికి చేరుకున్న నార్త్‌జోన్ అడిషినల్ డీసీపీ అశోక్ విద్యార్థులతో మాట్లాడుతూ ఐదు మందితో కమిటీ ఏర్పాటు చేసుకుని వెళ్లి యూనివర్శిటీ అధికారులను కల్సి సమస్యలపై చర్చించేలా తాను చూస్తానన్నారు.ఈ సందర్భంగా స్పాట్ నుంచి యూనివర్శిటీ అధికార్లకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు.

అడిషినల్ డీసీపీ అశోక్ హామీతో విద్యార్థులు శాంతించారు.

కళాశాలలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు.

హైదరాబాద్‌లో ఎటీఎం చోరీకి యత్నం..

-ముంబయి బ్యాంక్ హెడ్‌క్వార్టర్స్‌లో మ్రోగిన అలారం
హైదరాబాద్ పోలీసులను ఎలర్ట్ చేసిన బ్యాంక్ సిబ్బంది

పంజగుట్ట, నవంబర్ 16 (ప్రభాతవార్త): ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఇద్దరు పాత నేరస్థులు హైదరాబాద్ నగరంలో జైలులో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న తమ స్నేహితులైన గంజాయి నేరస్థులను కలవడానికి వచ్చారు. రావడంతోనే ములాఖత్‌లో తమ స్నేహితులను కలుసుకుని నగరంలో పలుచోట్ల రెక్కీ నిర్వహించారు. పనిలో పనిగా పోయేముందు ఒక ఏటీఎంను దొంగిలించాలని పథకం వేసుకున్నారు.ఈ క్రమంలో బంజారాహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ ఏటీఎంలో చోరీకి ప్రయత్నిస్తుండగా పోలీసులు అలెర్ట్ కావడంతో ఒకరు పోలీసులకు దొరికిపోగా మరొకరు పరారయ్యారు. ఘటన పూర్తి వివరాలలో కెళితే.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పాత నేరస్థులు పర్వేజ్, అరవింద్ జోలాలు నగరానికి వచ్చారు. తమ స్నేహితులైన సలీం, సక్లాలు గంజాయి కేసులో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి చంచల్‌గూడలో జ్యుడిషియల్ రిమూండ్‌లో ఉన్నారు. వారిని ములాఖత్‌లో కలిసిన అనంతరం ఇరువురు నేరుగా శ్రీనగర్‌కాలనీకి వచ్చారు. శ్రీనగర్ కాలనీ చౌరస్తాలోని కోటక్ మహీంద్రా బ్యాంక్ ఏటీఎంలోకి దూరారు. అక్కడ ఏటీఎం చోరీకి ప్రయత్నిస్తుండగా ముంబయ్‌లోని ఆ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో అలారం మ్రోగింది. బ్యాంక్ సిబ్బంది వెంటనే డైల్ 100కు, బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే సమయానికి వారిరువురు ఏటీఎం లోపలే ఉన్నారు. పోలీసులు వారిని పట్టుకునే క్రమంలో పర్వేజ్ పట్టుబడగా అరవింద్ కోలా తప్పించుకుని పరారయ్యాడు. పోలీసులు పర్వేజ్‌ను విచారించగా తాము శుక్రవారం ఉదయం సికింద్రాబాద్‌లో రైలు దిగి, తమ స్నేహితులను పరామర్శించిన అనంతరం ఏటీఎం చోరీ చేయాలని ముందుగానే నిర్ణయించుకున్నామని తెలిపాడు. ఇద్దరు డబ్బులు కొట్టేసి యూపీ చెక్కేయాలనే ప్లాన్‌ను పోలీసులు భగ్నం చేయడంతో పాటు ఒకరిని అరెస్ట్ చేయడం మరో నిందితుడి కోసం పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. జైలులో ఉన్న వీరి స్నేహితులతో పాటు వీరిపై కూడా పలు ప్రాంతాలలో పెద్ద ఎత్తున కేసులు నమోదై ఉన్నాయని పోలీసుల విచారణలో తేలింది.పర్వేజ్, అరవింద్‌లు గతంలో పలు ఏటీఏం చోరీలలో ఆరితేరిన వారే కావడంతో పాటు ఇంకా ఇతర కేసులు కూడా వీరిపై నమోదై ఉన్నాయి. ఏటీఎం సెంటర్‌కు వచ్చిన వీరు ముందుగా వంద రూపాయలు డ్రా చేశారు. మరుక్షణమే నగదు బయటకు వచ్చే ప్రాంతంలో మూసుకోకుండా ఫెవికాల్‌తో అంటించారు. కొద్దిదూరంలో నిలబడి ఏటీఎంలో డ్రా చేసుకోవడానికి వచ్చేవారిని గమనిస్తూ ఉన్నారు. నలుగురైదుగురు డ్రా చేయడానికి వచ్చి ప్రయత్నించగా నోట్లు వచ్చే ప్రాంతంలో ఫెవికాల్ అంటించి ఉండడంతో పూర్తిగా తెరుచుకోలేదు. డబ్బులు డ్రా కాకపోవడంతో వారు వెనుదిరిగారు. వెంటనే ఏటీఎంలోకి చొరబడిన వీరు అందులో చేయిపెట్టి పైకివచ్చిన నగదును తీసే క్రమంలోనే ముంబయ్‌లో అలారం మ్రోగడం, పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోవడం వెంట వెంటనే జరిగిపోయాయి. బ్యాంక్ అధికారి ముఖేష్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడం తో పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టారు.

కులగణనకు సహకరించిన ఎమ్మెల్సీ కవిత దంపతులు

పంజగుట్ట, నవంబర్ 16 (ప్రభాతవార్త): కులగణనకు ఎమ్మెల్సీ కల్వకుంట కవిత దంపతులు పూర్తిస్థాయిలో సహకరించారు. శనివారం బంజారాహిల్స్‌లోని నివాసంలో అధికారులు అడిగిన వివరాలను అందజేశారు.జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌లు అమలు చేయాలని మొదటి నుండి పోరాటం చేస్తున్న కవిత, గతంలో దామాషా ప్రకారం రిజర్వేషన్‌ల కోసం పలు సమావేశాలు,సభలు, రౌండ్ టేబుల్ మీటింగ్‌లు పెట్టిన విషయం విదితమే. రీసెంట్‌గా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు కులగణన విషయంలో తమ వద్దకు వచ్చిన ఎన్యుమరేటర్‌లకు అన్ని వివరాలను కవిత కుటుంబ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినట్టుగా కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అదేవిధంగా హామీల అమలులో భాగంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లను అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

నేడు,రేపు టిజిపిఎస్సీ గ్రూప్-3 పరీక్ష

-జిల్లాలో వ్యాప్తంగా 102 కేంద్రాలు..
-పరీక్ష రాయనున్న 45918 మంది అభ్యర్థులు

హైదరాబాద్,నవంబర్ 16,ప్రభాతవార్త: నేటినుంచి టిజిపిఎస్సీ గ్రూప్3 పరీక్షలు జరగనున్నాయి. 17,18 తేదీల్లో జరగనున్న ఈపరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయినవని,అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8:30 గంటల వరకు సాయంత్రం పరీక్ష కోసం 1.30 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. నిర్దేశించిన సమయం తర్వాత అభ్యర్థులెవరిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడరు అని పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 45918 మంది అభ్యర్థులు గ్రూప్3 పరీక్ష రాస్తున్నారని వీరి కోసం 102 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో పిడబ్ల్యుడి అభ్యర్థుల కోసం 27 కేంద్రాలను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం12.30 గంటల వరకు పేపర్1 (జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్) పరీక్ష ఉంటుందని పరీక్షా కేంద్రం గేట్లు ఉదయం 9.30 గంటలకు మూసివేస్తారన్నారు. అధేవిధంగా సాయంత్రం 3.00 గంటల నుండి 5.30 గంటల వరకు పేపర్ 2 (హిస్టరీ, పోలిటి అండ్ సొసైటీ)పరీక్ష ఉంటుందని అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.అలాగే సోమవారం రోజున ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్3 ఎకానమీ అండ్ డెవలప్మెంట్ పరీక్ష ఉన్నందున పరీక్షకు హాజరు అయ్యే అభ్యర్థులు సకాలంలో రావాలని తెలిపారు. అభ్యర్థులు సెల్ ఫోన్స్, క్యాలిక్యులేటర్ తో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తు వులకు అనుమతి లేదని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు. ట్రాఫిక్ దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు.

రాత్రంతా మూసీ వెంటే..!

-పరివాహక ప్రాంతాల్లో బిజెపి అగ్రనేతల నిద్ర
-నిర్వాసితులకు సంఘీభావం..అండగా ఉంటామని భరోసా

మూసీ పరివాహక బస్తీలో నిద్ర కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 16 ప్రభాతవార్త మూసీ వివాదం మరో లెవల్‌కు వెళ్లింది. సియోల్ తరహాలో హైదరాబాద్‌లో మూసీని పునరుజ్జీవింపజేస్తామంటూ రేవంత్ సర్కార్ చెబుతోంది.. ఇందుకోసం ఆయన ఈనెల ఎనిమిదో తేదీన నల్గొండ జిల్లాలోని మూసీ నదీ పరీవాహక ప్రాంతంలో పాదయాత్ర చేశారు రేవంత్. మూసీ పునరుజ్జీవానికి అడ్డుపడితే బుల్డోజర్లతో తొక్కిస్తామని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.రేవంత్ కామెంట్స్‌కు బీజేపీ నేత, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మూసి ప్రాంతం పేదలకు మనోధైర్యం కల్పించేందుకు, వారికి అండగా ఉంటానని కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. సీఎం వ్యాఖ్యలను తప్పుబట్టిన కిషన్ రెడ్డి.. బుల్డోజర్లు వస్తే చావడానికైనా సిద్ధమేనని చెప్పారు.ఈ క్రమంలోనే మొన్న మూసి వద్దా నిద్రపోగలరా అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన సవాల్ ను స్వీకరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దానికి తగినట్లుగా మూసీ పరివాహక ప్రాంతాల్లో బీజేపీ నిద్ర కార్యక్రమం చేపట్టారు.శనివారం రాత్రి అంబర్‌పేట తులసిరామ్‌నగర్ ప్రాంతంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు సహా ముఖ్యనేతలు బస్తీ నిద్ర చేపట్టారు. కిషన్ రెడ్డితో పాటు, బీజేపీ ఎంపీలు ఈటెల రాజేందర్,ఎల్‌బినగర్‌లోని గణేశ్ నగర్‌లో, డాక్టర్ కె.లక్ష్మన్ మలక్‌పేటలోని శాలివాహననగర్‌లో, రాజేంద్రనగర్‌లోని హైదర్‌షాకోటలో కొండ విశ్వేశ్వర్ రెడ్డి,అఫ్జల్‌గంజ్‌లోని రెసిడెన్షియల్ హౌసింగ్‌బస్తీలో బీబీ పాటిల్,అంబేద్కర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, కమలానగర్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల రాంచందర్‌రెడ్డి, శాస్త్రీనగర్‌లో మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, తదితర బిజెపి సీనియర్ నేతలు మూసి ఏరియాలోని 20 ప్రాంతాల్లో రాత్రి బస చేశారు.శనివారం సాయంత్రం ఆరు గంటలకు స్థానిక బస్తీల్లో పర్యటించారు. అనంతరం రాత్రి అక్కడే నిద్రించారు. అనంతరం ఆదివారం ఉదయం 9 గంటల వరకు బీజేపీ నేతలు ఆయా ప్రాంతాల్లో బస చేయనున్నారు.

పద్మశాలిపురంలో వీధి కుక్కల స్వైర విహారం

-చిన్నారికి తీవ్ర గాయాలు
-వీధి కుక్కల నియంత్రణలో అధికారులు విఫలం
- స్థానికులు ఆసహనం

అత్తాపూర్ నవంబరు16,ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో వీధి కుక్కలు స్వైర విహారం సృష్టిస్తున్న వీధి కుక్కల నియంత్రణ, కుక్కలతో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడంలో రాజేంద్రనగర్ సర్కిల్ జిహెచ్ఎంసి అధికారులు పూర్తిగా విఫలమైయ్యారు.వీధి కుక్కలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిహెచ్ఎంసి అధికారులు చెప్పుకుంటున్నప్పుటికి క్షేత్ర స్థాయిలో మాత్రం కనిపించడం లేదు.ఇందుకు ఉదారహరణ శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పద్మశాలిపురం ప్రాంతంలో చిన్నారిపై వీధి కుక్కలు చేసిన దాడి సంఘటననే ఇందుకు నిదర్శనం.పూర్తి వివరాలోకి వెళ్తే...సర్కిల్ పరిధిలోని పద్మశాలిపురం ప్రాంతానికి చెందిన చిన్నారి గులాబ్జా (5) ఇంటి ముందుకు ఆడుకుంటుండగా అక్కడికిగుంపులుగా వచ్చిన వీధి కుక్కలు చిన్నారిపై ఒకసారి దాడి చేశాయి. పాప కేకలు విన్న చుట్టుపక్క ప్రజలు వీధి కుక్కల భారి నుండి కాపాడారు.అయితే అప్పటికే చిన్నారి కాలును కుక్కలు బలంగా కోరుక్కడంతో తీవ్ర గాయాలు అయ్యాయి.దీంతో చిన్నారి గులాబ్జాను స్థానికుల సహాయంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు : స్థానికులు

వీది కుక్కల సమస్యలపైన గతంలోనే అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వీధి కుక్కల దాడి కొత్తది కాదని పేర్కొన్నారు.వీది కుక్కల దాడి జరిగినప్పుడు మాత్రమే అధికారులు హడావిడి చేస్తున్నారే తప్పా మిగతా సమయంలో పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధికుక్కల నియంత్రణపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి

విద్యార్థుల సామర్థ్యాలను వెలికితీయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉంది
-ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌లు

బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థలో నిర్వహించిన ఎఫ్‌డిసి కార్యక్రమంలో సర్టిఫికేట్లు ప్రదానం చేసిన దృశ్యం

చిక్కడపల్లి, నవంబరు 16 ప్రభాతవార్త: ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం ద్వారా అధ్యాపకుల్లో సబ్జెక్టుపై మరింత అవగాహన పెంచుకునే అవకాశం కలుగుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థలో ఐదు రోజుల పాటు నిర్వహించిన 'ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్(ఎఫ్‌డిసి) కింద అధ్యాపకులకు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం ముగిసింది. కమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ మాట్లాడుతూ విద్యార్థులలో దాగిఉన్న సామర్థ్యాలను వెలికితీయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందని అన్నారు. మొదటి రోజు కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జయవెంకటేశ్వర ఆధునికరించిన పద్ధతులు టీచింగ్ మెథడాలజీలో ఉన్న ప్రాధాన్యతలను వివరించారు. రెండవ రోజు ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ ప్యాట్రిక్ మాక్స్ మాస్, ఓపెన్ అన్సైన్ కోర్సులకు సంబంధించి స్వయం కోర్సుల ప్రాముఖ్యతలను వివరించారు. మూడవ రోజుల భవన్స్ కళాశాల కామర్స్ విభాగాధిపతతి ఎల్ఎస్.కమల మాట్లాడుతూ ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమంలో కంటెంట్ పరిజ్ఞానం టీచింగ్ అండ్ లెర్నింగ్ స్కిల్స్‌ను మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అధ్యాపకులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలన్నారు. నాల్గవ రోజు జరిగిన కార్యక్రమంలో ఉస్మానియా వర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ ఇంద్రకంటి శంకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్, ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

అడిక్‌మెట్ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి
-ఎమ్మెల్యే మురాగోపాల్

పనులను ప్రారంభించిన దృశ్యం

చిక్కడపల్లి, నవంబరు 16 ప్రభాతవార్త: అడిక్‌మెట్ డివిజన్ సమగ్రాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బుధవారం అడిక్‌మెట్ డివిజన్‌లోని ఎస్సార్టీ కాలనీ ప్రాంతంలో రూ.5.80లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీవరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాటర్‌బోర్డు డీజీఎం మోహన్‌రాజ్, ఏఈ శివసాయి. బిఆర్ఎస్ డివిజన్ కార్యదర్శి సురేందర్, నేతలు నేతా శ్రీను, మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎనర్జీ సెక్రటరీని కలిసిన పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ బృందం



సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియాతో ప్రెసిడెంట్ రత్నాకర్‌రావు, సెక్రటరీ జరల్ సదానందం తదితరులు

హైదరాబాద్,నవంబర్ 16,ప్రభాతవార్త: తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్‌కు కొత్తగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు రత్నాకర్ రావు, సదానందంల ఆధ్వర్యంలోని కార్యవర్గ బృందం శనివారం ఎనర్జీ సెక్రటరీ,జెన్కో సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియాను కలిసారు. విద్యుత్ సౌధలో ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పలుఅంశాలపై చర్చించారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులను సందీప్ కుమార్ సుల్తానియా అభినందించారు. సంస్థ మనుగడ కోసం పనిచేయాలని, అన్నిరకాల వినియోగదారులకు 24గంటల నిరంతర విద్యుత్ అందించాలని కోరగా అందుకు అనుగుణంగా పనిచేస్తామని అసోసియేషన్ నాయకులు తెలిపారు. సిఎండీని కలిసిన వారిలో అసోసియేట్ ప్రెసిడెంట్ జనప్రియ, అడిషనల్ సెక్రటరీ జనరల్ వెంకటేశ్వర్లు, గోపాల్ రావు, కిరణ్, సత్యనారాయణ రాజు, విద్య సాగర్,కిషోర్,రమేష్,శ్రీనివాస్‌రెడ్డి, చిత్తరంజన్, వెంకటేష్, సురేష్ కుమార్, సురేష్ బాబు మరియు లక్ష్మి ప్రసాద్ వున్నారు.

పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం
-ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

బల్మూరి వెంకట్‌ను గొంగడితో సన్మానిస్తున్న డైరెక్టర్ శివాజీ కురుమ, బిసినేత కనకాల శ్యాంకురుమ తదితరులు

హైదరాబాద్, నవంబర్ 16,ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు తప్పకుండా న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ఇటీవల హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నియమితులైన కనకాల శివాజీ కురుమ తన కుటుంబసభ్యులతో కలిసి ఎమ్మెల్సీ వెంకట్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి తన నియామకానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బల్మూరి వెంకట్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి ఛీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌లు తప్పకుండా గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ తదితరులు పాల్గొన్నారు

మానవతావాది భూధాన్‌నేత వినోభాభావే : గున్నా రాజేందర్‌రెడ్డి

నాంపల్లి, నవంబరు 16 ప్రభాతవార్త : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భూధాన్ ఉద్యమ నాయకుడు వినోభాభావే దేశవ్యాప్తంగా పాదయాత్ర చేసి భూస్వాముల నుండి సేకరించిన 46లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టిన గొప్ప మానవతావాదని రాష్ట్ర గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఛైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి అన్నారు. గ్రామాల్లో కనీసం గజం భూమి కూడా లేనివారి దుర్భర బతుకులు చూసి ఎంతగానో చలించిపోయిన ఆయన దేశంలోని అనేక రాష్ట్రాల్లో తన భూధాన ఉద్యమం ద్వారా సంపన్ను రైతులు స్వచ్ఛందంగా సేకరించిన సాగుభూములను అక్కడికక్కడే కుల మత ప్రాంతాలకు అతీతంగా పేదలకు ఉచితం పంపిణీచేసిన గొప్ప సాంఘిక ఉద్యమకారుడని కొనియాడారు. వినోభాభావే వర్ధంతిని పురస్కరించుకొని నాంపల్లిలో జరిగిన కార్యక్రమంలో రాజేందర్‌రెడ్డి గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి, ప్రతినిధులు గిరిధర్‌గౌడ్, శ్రీకాంత్, చైతన్యరెడ్డి, సౌజన్య, రాజేశ్ తదితరులతో కలిసి వినోభాభావే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి ప్రసంగించారు. ఆనాడు నల్గొండ జిల్లాలో నిర్వహించిన పాదయాత్రలో పోచంపల్లిలో భూమిలేని పేదలు తాము బతకడానికి సాగుభూములు కావాలని భావేను వేడుకున్నారని, తక్షణమే స్పందించిన భూస్వామి రామచంద్రారెడ్డి తన వందెకరాల భూమిని దానంగా వినోభాభావేకి ఇవ్వగా ఆభూమిని పేదలకు పంచిపెట్టారని రాజేందర్‌రెడ్డి విశదీకరించారు.



వినోభాభావే చిత్రపటానికి పుష్పాంజలితో ఘన నివాళులర్పిస్తున్న రాజేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గిరిధర్‌గౌడ్ తదితరులు

చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు : తహసీల్దార్ చంద్రశేఖర్

చార్మినార్,నవంబరు 16 ప్రభాతవార్త : బాలికలు కష్టపడి చదువుకుంటే ఉన్నత రంగాలలో రాణిస్తారని బహదూర్‌పుర మండలం తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని బాలికలు ఎన్ని అడ్డంకులు వచ్చిన భయ పడకుండ కష్టపడి చదవుకుని మంచి ఉద్యోగాలు సంపాదించుకోవాలని ఆయన కోరారు.బాలల వారోత్సవాలు సందర్భంగా శనివారం సాయంత్రం దూద్‌బౌలిలోని అశ్రిత హోంలో జరిగిన కార్యక్రమానికి తహసీల్దార్ చంద్రశేఖర్ ముఖ్య అతిధిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశ్రిత్ హోంలోని అర్హులైన బాలికలకు సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని,అశ్రిత్ హోమ్‌కు అన్ని విధాల సహాయాన్ని అందజేస్తామని తెలిపారు.ఇంటర్మీడియట్,పదోతరగతి పరీక్షలలో ప్రతిభ కనపరిచని బాలికలకు ఆయన హుమతులు ప్రధానంచేశారు.హోమ్ తరుపున తహసీల్దార్ చంద్రశేఖర్‌ను శాలువ కప్పి సన్మానించారు. కామాటిపుర పోలీస్ స్టేషన్ ఎస్ఐ రవీందర్ మాట్లాడుతూ బాలికలు బాగాచదువుకుని మంచి ర్యాంకులు సాధించాలని కోరారు. బాలికలకు వేధింపులు ఉంటే భయపడ కుండ 100 నెంబర్‌కు ఫోన్ చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని ఆయన తెలియజేశారు.బాలల వారోత్సవాలు సందర్భంగా అశ్రిత్ హోమ్‌కు చెందిన బాలికలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో నంది అవార్డు గ్రహీత కబీర్,స్టేట్ కోఆర్డినేటర్ క్రాంతి కుమార్,ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ వి. పర్వతాలతో పాటు పలువురు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న బహదూర్‌పుర మండలం తహసీల్దార్ చంద్రశేఖర్

వ్యవసాయ అధికారులకు ప్రమోషన్‌లు కల్పించాలి
-తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర చైర్మన్ కృపాకర్ రెడ్డి

చిక్కడపల్లి, నవంబరు 16 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న వ్యవసాయ అధికారులకు సీనియార్టీ ప్రకారం ప్రమోషన్‌లు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర చైర్మన్ బి.కృపాకర్‌రెడ్డి బి.కృపాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బి.కృపాకర్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని కేడర్స్‌లో సీనియార్టీ ప్రకారం జాబితాను తయారు చేయాలని, ప్రతి వ్యవసాయ అధికారికి వాహనంతో పాటు ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అధికారులకు ఇతర సౌకర్యాలు కూడా కల్పించాలని కోరారు. వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీలు చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే బదిలీలు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధికారులు వ్యవసాయదారుల వద్దకు, పొలాల వద్దకు వెళ్లి సలహాలు ఇవ్వడానికి నిరంతరం పర్యటనలు చేయాల్సి ఉన్నా వాహనసౌకర్యం కాని, వాహనాలకు ఖర్చులు ఇవ్వకపోవడం వల్ల సొంతంగా ఖర్చు పెట్టుకుని తిరగాల్సి వస్తుందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలాధారమైన వ్యవసాయ రంగానికి, వ్యవసాయదారులకు సేవలందిస్తున్న వ్యవసాయ అధికారులకు పదోన్నతులు, సరైన సౌకర్యాలు కల్పించినట్లయితే రైతులకు మరింత మెరుగైన సేవలందించడానికి వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.వైద్యనాథ్, జి.కృపాకర్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ కాంతారావు, ఉపాధ్యక్షుడు శివధర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అనూరాధ, కోశాధికారి రవీందర్‌రెడ్డి,కార్యనిర్వాహక కార్యదర్శి మహేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి మానస తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర చైర్మన్ బి.కృపాకర్ రెడ్డి

నేడు,రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హైదరాబాద్, నవంబర్ 16,ప్రభాతవార్త: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా ఆది,సోమవారాల్లో పలు ప్రాంతాలో విద్యుత్ సరఫరాలోఅంతరాయం ఉంటుందని సైఫాబాద్ డివిజన్ ఏడీఈ ఓప్రకటనలో తెలిపారు. 11కెవి మెయింటనెన్స్,ఎబి స్విచ్చెస్, బ్రీకటింట్ వర్క్స కారణంగా రెండురోజులపాటు మరమ్మతు పనుల చేపట్టనున్నట్లు తెలిపారు.ఎర్రమంజిల్ సబ్‌స్టేషన్ పరిధిలోని రెడ్‌రోజ్ ఫీడర్, పరిధిలోని సంగీత్‌నగర్, కపాడియా లైన్, సివిల్ సప్లైగల్లీ, ఎర్రమంజిల్ మెయిన్‌రోడ్‌లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఆది, సోమవారాల్లో విద్యుత్ నిలిపివేయనున్నారు. అలాగే ఐసీ క్వార్టర్స్ ఫీడర్ పరిధిలోని ఎర్రమంజిల్ కాలనీ, రవీంద్రనికేతన్ స్కూల్, ఆర్‌అండ్‌బి ఏరియా, హెరిటేజ్ లైన్,నిమ్స్ మెయిన్‌రోడ్‌లో మధ్యాహ్నం 2గంటలనుంచి సాయంత్రం 5గంటలవరకు రెండురోజులపాటు కొనసాగనుంది. అలాగే ఎగ్జిబిషన్ సబ్‌స్టేషన్ పరిధిలో పరిధిలోని జగదీష్‌మార్కెట్ ఫీడర్‌పరిధిలో గల జగదీష్‌మార్కెట్, బాషా మజిల్, కరీంబాద్ కాలనీ, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ప్రాంతాల్లో ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఆది, సోమ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.అలాగే నిజాం కాలేజ్ సబ్‌స్టేషన్ లిటిల్ ఫ్లవర్ ఫీడర్ పరిధిలో లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఏరియా, లక్ష్మీ టాకీస్, మహేష్ నగర్, మెడ్విన్ హాస్పిటల్, డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్, డిసిబి బ్యాంక్ ఏరియాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. అలాగే ఎగ్జిబిషన్ సబ్‌స్టేషన్ పరిధిలోని కలెక్టర్ ఆఫీస్, చంద్రవిహార్, కేర్, ఏసిబి ఆఫీస్, సియాసత్ ప్రెస్ ఆఫీస్, డిఏకె సదన్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నఉంచి సాయంత్రం 5గంటలవరకు ఆది,సోమవారాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడనుంది.

తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలి

ప్రసంగిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి

చిక్కడపల్లి, నవంబరు 16 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం 250 గజాల ఇళ్ళ స్థలాలను ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ ఉద్యమకారఉల జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారులకు రూ.25 వేల పెన్షన్‌తో పాటు హెల్త్‌కార్డులు, గుర్తింపుకార్డులివ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారుల జేఏసీ వైస్‌చైర్మన్ బత్తుల సోమయ్య, ప్రధాన కార్యదర్శి ప్రఫుల్‌రాంరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, గడ్డం రాజేష్, గంటా రామ్‌చందర్, జనార్దన్, వెంకటేశ్వర్లు, అన్వర్‌పటేల్, స్వరూప,సునీత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా అన్నకూట్ మహోత్సవాలు

పాతబస్తీ మీరాలంమండి శ్రీ మహాంకాళేశ్వర దేవాలయంలో జరిగిన మహా అన్నకూట్ మహోత్సవాలలో పాల్గొన్న వేలాది మంది భక్తులు

చార్మినార్,నవంబరు 16 ప్రభాతవార్త : కార్తీక మాసం సందర్భంగా పాతబస్తీ మీరాలంమండి శ్రీ మహాంకాళేశ్వర దేవాలయంలో మహా అన్న కూట్ మహోత్సవాలు అత్యంత వైభంగా మందిరం కమిటి చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో జరిగాయి.మీరాలంమండితో పాటు పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు మందిరంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గాజుల అంజయ్య మాట్లాడుతూ మందిరంలో ప్రతీ సంవత్సరం వైభవంగా మహా అన్న కూట్ మహోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాలలు బ్రహ్మజ్ఞానులు

చిక్కడపల్లి, నవంబరు 16 ప్రభాతవార్త: బాలలు బ్రహ్మజ్ఞానులు అని, చిన్నతనంలో గ్రహశక్తి వారిలో అధికమని ప్రముఖ కవి పెద్దూరి వెంకటదాసు అన్నారు. శనివారం సాహితీ జిగీష సంస్థ ఆధ్వర్యంలో చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పౌరాణిక క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం, ప్రముఖ కవి బండారుపలల్లి రామచంద్రరావుకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ప్రముఖ కవి, కీర్తిపురస్కార(గ్రహీత రఘుశ్రీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పెద్దూరి వెంకటదాసు హాజరై ప్రారంభించి ప్రసంగించారు. లక్ష్మణరేఖ గోపాలకృష్ణ, సాహితీ జిగీష కార్యదర్శి డాక్టర్ లలితవాణి సభా సమన్వయం చేశారు.

గడ్డమీది జంగన్నగౌడ్‌కు 'పాన్ ఇండియా నేషనల్ అవార్డు' ప్రదానం

చిక్కడపల్లి నవంబరు 16 ప్రభాతవార్త: తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు, సామాజిక కార్యకర్త గడ్డమీది జంగన్నగౌడ్‌కు 'పాన్ ఇండియా నేషనల్ అవార్డు' అందుకున్నారు. నగరంలో శనివారం పాన్ ఇండియా ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును తెలంగాణ జనసమితి అధినేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, గజల్ శ్రీనివాస్ చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాలకృష్ణ, అవార్డు కమిటీ అధ్యక్షుడు అద్దంకి రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజులు చెల్లించాలని "మహా ర్యాలీ"
విద్యార్థులకు ప్రభుత్వం భరోసా కల్పించాల్సి పోయి - ఆటంకం కలిగిస్తుంది : ఆర్.కృష్ణయ్య

కుషాయిగూడ, నవంబర్ 16 ప్రభాతవార్త: కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ విద్యను పొందలేక రోడ్లమీద ర్యాలీలు చేస్తున్న విద్యార్థులకు ఫీజులు చెల్లించకపోవడం దారుణమని బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల 75 వేల మంది విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులు చెల్లించని కారణంగా విద్యార్థులు రోడ్డున పడిన దుస్థితిని పురస్కరించుకొని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా,కాప్రా సర్కిల్ పరిధిలోని ఈసీఐఎల్ చౌరస్తా నుండి ప్రారంభించిన వేలాదిమంది విద్యార్థుల నిరసన ర్యాలీలో కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నిధుల విడుదలకు అడ్డుకట్ట వేస్తూ గాలిలో దీపంలగా విద్యార్థుల చదువులు మారాయని. కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించివిద్యార్థుల స్కాలర్షిప్ బిల్లులు చెల్లించరా! అని ఆయన ప్రశ్నించారు. ఇదేమి న్యాయం ఇదేమి ప్రభుత్వం అంటూ నినాదాలు ఇస్తూ విద్యార్థులు మహార్యాలీ ప్రదర్శన జరిపారు. మూడు సంవత్సరాలుగా విద్యార్థుల స్కాలర్షిప్ బిల్లులు చెల్లించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11నెలలు గడుస్తున్నా ఒక్కరూపాయి స్కాలర్‌షిప్‌లకు బిల్లులు ఇవ్వడం లేదన్నారు.విద్యార్థులకు పెండింగ్ బకాయిలు చెల్లించకుంటే రాష్ట్రాన్ని అగ్గిగుండంగా మారుస్తామని బిసి నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ , భూపేష్ సాగర్, మనోజ్, వెంకన్న గౌడ్, అంజి, సతీశ్, అనంతయ్య, రాజేందర్, చంద్రశేఖర్, హరీష్, నిఖిల్, అరవింద్, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఆర్ కృష్ణయ్య

ఒంటరి మహిళలు చెడును జయించాలి

రవీంద్రభారతి, నవంబరు 16 ప్రభాతవార్త : నేటి ప్రపంచంలో చెడు అనేది సర్వసాధారణమై పోయిందని, ఒంటరి మహిళలు ముఖ్యంగా చెడును సమర్థవంతంగా జయించి నిర్భయంగా ముందుకు వెళ్లినరాడే తమ, తమ పిల్లల భవిష్యత్తుకు, జీవితాలకు మంచి సార్థకత ఏర్పడుతుందని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి ఉద్బోధించారు. లోకంలో చెడు అనేది ఎప్పటినుండో ఉందని, త్రేతాయుగంలో రావణుడు.... ద్వాపరయుగంలో నరకాసురుడు, ఈ కలికాలం మానవమృగాలను చూస్తేనే ఉన్నామన్నారు. ప్రతీయుగం, ఇళ్లల్లో చెడ్డవాళ్లు ఉన్నా చెడ్డకు దూరంగా మంచిని చేస్తూ.... పాటిస్తూ .... ఆలోచిస్తూ మంచి చేయడం కోసం ఒంటరి మహిళల పిల్లలంతా ఆలోచించేటట్టు, ఆచరించేటట్టు కృషిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎంతో కష్ట తప్పదుకాక కానీ జీవితంలో పిల్లలు మంచివాళ్లై భవిష్యత్తు పరిమళిస్తుందని రమణాచారి తెలిపారు. నేడు ఆర్థిక సహకారం పొందుతున్న పిల్లలకు శుభాశీస్సులు తెలుపుతూ వారి జీవితాల్లో వెలుగులు విరజిమ్ముతాయని ఆకాంక్షించారు. ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆర్.జె ఇన్స్పిరేషన్ హాండ్స్ అధ్యక్షురాలు ఉమాకార్తిక్‌ను అభినందిస్తూ మీ ఆలోచన, దీక్ష, పటిమవల్ల పిల్లలకు మేలుజరుగుతుందని, మున్ముందు మరింతమంది ఇలాంటి పిల్లలు బాగుపడతారని సంస్థకు కూడా అభినందనలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, ఆర్.జె ఇన్స్పిరేషన్ హాండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో సంస్థ ఛైర్‌పర్సన్ ఉమాకార్తిక్ నిర్వహణలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథి డా. కె.వి.రమణాచారి, విశిష్ట అతిథులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఇన్‌కంటాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లవిదియా, నరేన్ వనపర్తి తదితరులతో కలిసి ఆర్థిక సహాయంగా ఒంటరి మహిళలకు, పిల్లలకు చేయూత.... చెక్కుల పంపిణీ కావించి వారు అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని దీవించారు. ఇన్‌కంటాక్స్ కమిషనర్ జీవనలాల్ ఒంటిరి మహిళల పిల్లలు తల్లిమాట జవదాటకుండా ముందుకుసాగాలని, కష్టపడి మంచి పేరుప్రఖ్యాతులు సాధించాలని సూచిస్తూ ఆడసింహం ఎలా వేటాడి తమపిల్లలను పోషించి పెద్దచేస్తాయో అలాగే పాటుపడుతున్న ఒంటరి మహిళలు ఆడ సింహాలని అభివర్ణించి అభినందించారు.



ఆర్థికసహాయం పొందిన పిల్లలతో జీవన్‌లాల్, ఉమాకార్తిక్, నరేన్, చక్రవర్తి తదితర అతిథులు

ఉద్యమకారుల విజయ సంకల్పయాత్రకు హాజరు కావాలని శోభన్‌రెడ్డికి విజ్ఞప్తి

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి తధితరులు

తార్నాక, నవంబర్ 16 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారుల విజయ సంకల్ప మహాపాదయాత్ర నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ తెలంగాణ ఉద్యమకారుల ఫోర్ జిల్లా అధ్యక్షులు దయానంద్ పేర్కొన్నారు. మహాపాదయాత్రకు సంభందించి రూపొందించిన వాల్‌పోస్టర్‌ను టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి తార్నాకలోని ఆయన నివాసంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు పాదయాత్రకు హాజరు కావాలని శోభన్‌రెడ్డిని కోరారు. ఉద్యమకారులకు తగిన గుర్తింపు కాంగ్రెస్ పార్టీతోనే వస్తుందని శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం శరన్న, నియోజక వర్గ కన్వీనగర్ ఆర్.కె భూపాల్, జిల్లా జీఎస్, నరసింహ్మాచారి, జిల్లా ఉపాధ్యక్షుల

రాజీవ్ గృహకల్పకు త్వరలోనే బస్సు సౌకర్యం

గృహకల్ప కాలనీలో పర్యటిస్తున్న డిపో మేనేజర్, హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్, నవంబర్ 16, ప్రభాతవార్త

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్ప కాలనీ ప్రజలు, విద్యార్థులు సుధీర ప్రాంతాలకు వెళ్ళేందుకు రాజీవ్ గృహకల్ప కాలనీకి బస్సు సౌకర్యం లేకపోవడంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డికి బస్సు సౌకర్యం కల్పించమని కోరగా, వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. గత నాలుగైదు రోజులుగా పర్యవేక్షణ చేయగా శనివారం కూకట్‌పల్లి డిపో మేనేజర్, కొలన్ హన్మంత్‌రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డిలు రాజీవ్ నగర్ ప్రాంతంలో పర్యటించి బస్సు రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. బస్సు అసౌకర్యానికి గురికాకుండా రోడ్లపై ఉన్నటువంటి ఫుట్‌పాత్‌ను, రాళ్లను వెంటనే హన్మంత్‌రెడ్డి చొరవతో బాగు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్ర నాయక్, పితాని శ్రీనివాస్, లక్ష్మన్, సరితారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాలకృష్ణ, ఉషారాణి, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి పేదలకు వరం : కొలన్ హన్మంత్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కును పంపిణీ చేస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్, నవంబర్ 16, ప్రభాతవార్త

ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఒక గొప్ప వరమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అనారోగ్యంతో బాధపడుతు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన బాధితులకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం రూ.60,000 సీఎం సహాయనిధి నుండి మంజూరి చేయించిన కాంగ్రెస్ హన్మంత్‌రెడ్డి 125, 126, 131 డివిజన్‌లకు చెందిన వాసులు మల రావు, కర్రీ సత్యనారాయణ, వీణ, లక్ష్మమ్మలకు మంజూరి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారందరూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేసునతందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్‌రెడ్డి, బోయిని వెంకటేష్, డివిజన్ అధ్యక్షులు లాయక్, గణేష్, నాయకులు జీవన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, వేణు గౌడ్, గఫ్ఫార్ మధుసూదన్‌రెడ్డి, అజయ్, అరుణ్, ప్రశాంత్‌రెడ్డి, శ్యామల, ఊపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువుకు చికిత్స విజయవంతం

పంజగుట్ట, నవంబర్ 16 (ప్రభాతవార్త):

నెలలు నిండకుండానే బిడ్డ జన్మించింది..ఆ బిడ్డకు వైద్యం చేయాలంటే ఎంతో నైపుణ్యం కావాలి.అందుకే టెన్షన్‌కు పులిస్టాప్ పడింది. వైద్యల కృషి ఫలించి 28 వారాలలో జన్మించిన 760 గ్రాముల బరువు గల శిశువుకు కొత్త జీవితం ఇచ్చారు.ప్రాణాపాయ పరిస్థితులను అధిగమించేలా చేశారు. ఇది అపోలో క్రెడిల్ చిల్డ్రన్స్ ఆసుపత్రి అధునాతన సాంకేతికతతో పాటు వైద్యుల కృషికి నిలువుటద్దంలా నిలిచింది. వివరాల్లోకెళితే ఆగస్టు 31 తేదీన నగరానికి చెందిన దంపతులు రాజమోహనరెడ్డి, కవితలకు మగ బిడ్డ జన్మించింది. పసివాడికి సమస్యలు ఉన్నాయని స్థానిక వైద్యులు చెప్పడంతో అపోలోకు తరలించారు. శివువు నెలలు నిండకుండానే జన్మించింది.చాలా తక్కువ బరువు కలిగిఉంది. మూడోరోజు శిశువు కడుపులో ఎక్సరే తీయగా పేగు చీలిక కారణంగా ప్యుమోపెరిటోనియం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అక్కడ నుండి వైద్యులు తమ కృషిని ప్రారంభించి క్రమంగా ఆహార పరిమాణాన్ని పెంచుతూ ఆహారం అందించారు. ఈ చికిత్స దాదాపు రెండు నెలల సమయం పట్టింది. ఎన్ఐసీయూలో సంరక్షణ పొందిన శిశువు 1.56 కిలోల బరువుతో ఆరోగ్యవంతమైన స్థితిలో డిశ్చార్జ్ చేశారు. ఈ వైద్యంలో పీడియాట్రిక్ టీమ్ డాక్టర్ లలతేందు కుమార్ ఆధ్వర్యంలో పనిచేసిన వైద్య బృందం తల్లిదండ్రుల కళ్ళలో ఆనందం నింపగలిగారు.

ఆకాశదీపం-జ్వాలాతోరణంతో భక్తుల తన్మయం

శ్రీరాంనగర్ శ్రీ శివ మార్కండేయ దేవాలయ జాలాతోరణ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గూడె రాజశేఖర్

కుత్బుల్లాపూర్, నవంబరు 16 ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ పరిధిలో కార్తీకపౌర్ణమి సందర్భంగా శివనామ స్మరణతో భక్తకోటి తరించింది. కార్తీకపౌర్ణమి సందర్భంగా రోజంతా ఒక్కపొద్దులు, ఉపవాసాలు చేసిన భక్తులు రాత్రి శివాలయాలలో శివపార్వతులను దర్శించుకుని మొక్కులను విడిచిపెట్టారు. గాజులరామారం శ్రీరామ్‌నగర్‌లో వెలసిన శ్రీ శివ మార్కండేయస్వామి దేవాలయంలో నిర్వహించిన ఆకాశదీపం-జ్వాలా తోరణ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో కన్నులపండువగా జరిగింది. ఆలయ ధర్మకర్త గూడె రాజశేఖర్ నాయకత్వంలో ఆకాశ దీపం, జ్వాలా తోరణకార్యక్రమాలను భారీభక్త సందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. సామూహిక కుంకుమార్చణ, కార్తీక దీపాలతోపాటు భక్తులు మూడువందల ఆరవై ఐదు ఒత్తులతో శివపార్వతులను స్మరించుకున్నారు. కార్తీకపౌర్ణమి సదర్భంగా రాత్రంతా భక్తులు బారులుగా నిలబడి శివపార్వతులను దర్శించుకుని స్మరించి ఒక్కపొద్దులు విడిచిపెట్టారు.

చర్చిల వద్ద సిసి కెమేరాలను ఏర్పాటు చేసుకోవాలి : డిసిపి రక్షిత పెరుమాల్

అడ్డగుట్ట,నవంబర్ 16 ప్రభాతవార్త: ప్రార్థన మందిరాలు,చర్చిల వద్ద తప్పని సరిగా సీసీటీవి కెమరాలను ఏర్పాటు చేసుకోవాలని ఉత్తర మండలం డిసిపి సూచించారు. శనివారం ఈస్ట్ మారేడ్‌పల్లిలోని సీఎస్ఐ ఇన్‌స్టిట్యూట్ పిజీ కళాశాల ప్రాంగణంలో చర్చి ఫాదర్లు, ఫాస్టర్లు నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నార్త్‌జోన్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న ఆయా చర్చిల వద్ద సీసీటీవి కెమరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదే విధంగా చర్చీలు,ప్రార్థన మందిరాల వద్ద వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసుకోవడంతో పాటు గేట్లు,గ్రిల్స్ సక్రమంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. అపరిచితులు, ఎసంఘవిద్రోహ శక్తులు చర్చిల వద్ద సంచరిస్తే పోలీస్‌లకు సమాచారం అందించాలన్నారు.

భగత్‌సింగ్ మేనల్లుడి పర్యటనను విజయవంతం చేయండి : సిపిఐ

జగద్గిరిగుట్ట, నవంబర్ 16, ప్రభాతవార్త

ఈ నెల 27వ తేదీన కుత్బుల్లాపూర్ మండలంలోని జగద్గిరిగుట్ట, గాజులరామారంలో పర్యటనకు విచ్చేస్తున్న భగత్ సింగ్ మేనల్లుడు ఘన స్వాగతం పలికి పర్యటనను విజయవంతం చేయాలని సిపిఐ నాయకులు పేర్కొన్నారు. శనివారం జగద్గిరిగుట్టలో అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసఫ్ విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో భగత్‌సింగ్ పేరు వింటేనే యువకుల రక్తం ఉరకలేస్తుందని, కానీ నేడు ప్రపంచీకరణ, సినిమాలో హీరో అంటే నలుగురిని తన్ని, ఒక అందమైన అమ్మాయి కోసం ఎదురుతిరిగి పెండ్లి చేసుకునే వాడిని హీరోగా పరిచయం చేస్తూ ప్రజలకు అసలు హీరోలను పరిచయం చేస్తలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందరికి తెలిసిన అసలైన హీరో భగత్‌సింగ్ అని చెప్పడానికి అఖిల భారత యువజన, విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన, వ్యక్తృత్వ, పాటల పోటీలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే నేడు భగత్‌సింగ్ కుటుంబంలో పుట్టి, ఆయన వారసత్వాన్ని, లక్ష్యాలను ప్రజలకు తెలియచేస్తున్న వారి మేనల్లుడు ప్రొఫెసర్ జగ్మోహన్ సింగ్ మన ప్రాంతానికి వస్తున్నారని తెలిపారు. ప్రతీ ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. భారత దేశానికి స్వాతంత్ర్యం కావాలి కానీ భగత్‌సింగన

పోస్టర్‌ను విడుదల చేసిన సిపిఐ నాయకులు

కాపాడుకోవడానికి కాదని క్షమాబిక్ష అడగకుండా ఉరితాడును ముద్దాడుతూ ఇంక్విలాబ్ జిందాబాద్, సామ్రాజ్యవాదం నశించాలి అనని నినాదాలిస్తూ మరణాన్ని ధైర్యంగా ఆహ్వానించారని అలాంటి వారి చరిత్ర తెలుసుకొని ప్రజలు దేశభక్తి స్ఫూర్తిని పొంది, ధైర్యం తెచ్చుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యువజన సమాఖ్య కార్యదర్శి వెంకటేష్, యువజన నాయకులు బాబు, రాంరెడ్డి, సిపిఐ కార్యదర్శి ఉమామహేష్, సహాయ కార్యదర్శి దుర్గయ్య, కార్యవర్గ సభ్యులు స్వామి, హరినాథ్, నర్సయ్య, రాములు, శ్రీనివాస్, సహదేవ్‌రెడ్డి, యాగంటి, సిపిఐ నాయకులు ఇమామ్, జానకిరామ్, నర్సింహ, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

విఠలేశ్వర రుక్మిణ మాత అమ్మవారి దేవాలయంలో పూజలు

విఠలేశ్వర స్వామి దేవాలయంలోపూజలు చేసిన దృశ్యం

అఫ్జల్‌గంజ్,నవంబర్ 16ప్రభాతవార్త:

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఉస్మాన్‌షాహి విఠల్ నగర్‌లోని చారిత్రాత్మకమైన విఠలేశ్వర రుక్మిణ మాత అమ్మవారి దేవాలయంలో అమ్మవారికి గోషామహల్ నియోజకవర్గం బిజెపి శాసనసభ్యులు టి.రాజాసింగ్ ప్రత్యేక పూజలు చేశారు.ఈకార్యక్రమంలో ఆలయక కమిటి చైర్మన్,కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్,ఆలయ కమిటి అధ్యక్షులువి. కిషన్‌యాదవ్,ప్రధాన కార్యదర్శి పి.మాణిక్‌రావు,గోల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు వి.పాండుయాదవ్,గోవింద్‌రాజు మహారాజ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారంతో కుదుటపడ్డ బతుకులు : శ్రీనివాస్

కుత్బుల్లాపూర్, నవంబరు 16 ప్రభాతవార్త

గత కొంతకాలంగా వక్ఫ్‌బోర్డు జిఓ పేరుతో కుత్బుల్లాపూర్‌లో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమవడంతో ప్రజలు ఒక్కసారిగా ఊపిరిపీల్చుకున్నారు. గతకొంతకాలంగా ఆందోళకు గురవుతున్న పద్మానగర్ ఫేజ్-2వాసులు ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు కె.పి.వివేకానంద్‌ను కలిసి అభినందనలు తెలిపారు. పద్మానగర్ ఫేజ్-2సంక్షేమ సంఘ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్ నాయకత్వంలో స్థానికులు ఎంఎల్ఎ వివేకానంద్ నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా దేవరకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డుజిఓ పేరుతో సర్వేనెంబరు 56 నుండి సర్వేనెంబరు226వరకు రిజిస్ట్రేషన్లను నిలిపివేయడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఉన్న పద్మానగర్ ఫేజ్-1, ఫేజ్-2లలోని రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో తీవ్ర ఆందోళన నెలకొందని ఎంఎల్ఎ వివేకానంద చొరవతో ఉన్నతాధికారులతో చర్చించి రిజిస్ట్రేషన్ల పునరుద్దరణ ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పద్మనగర్ ఫేజ్-2 అధ్యక్షులు సత్తిరెడ్డి, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పప్పిరెడ్డి సురేందర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, అప్పారావు, సతీష్, మురళి, బ్రహ్మానందం, దేవేందర్ రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో పత్రికలదే కీలక పాత్ర

తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి

ముషీరాబాద్, నవంబర్ 16, ప్రభాతవార్త: ఆనాటి స్వాతంత్ర్యోద్యమంలో పత్రికలదే కీలక పాత్ర అని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. శనివారం జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా విలేఖరులతో మాట్లాడుతూ సమాజంలో మీడియాను నాలుగవ స్థంభంగా భావిస్తామని, అటువంటి మీడియా రంగంలో పనిచేసే విలేఖరుల సంక్షేమాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. బ్రిటీష్ కాలంలో 1780 లో బెంగాల్ గెజిల్, అగస్టిన్ హిక్కి వంటి పత్రికల స్థాపన జరిగి వాటి ద్వారా బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు రాస్తూ, ప్రజలను చైతన్య పరిచారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సైతం మీడియా రంగం తన పదాలనే తూటాలుగా మార్చి భావప్రకటనా వ్యాప్తి చేయటం ద్వారా రాష్ట్ర సాధనలో సైతం తమదంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నాయని అన్నారు.

సిఎంకు ఎల్లప్పుడు రుణపడి ఉంటాం: మురళీ ముదిరాజ్

తిరుమలగిరిలో సిఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేత మురళీ ముదిరాజ్ తదితరులు

కంటోన్మెంట్,నవంబర్ 16 ప్రభాతవార్త: సిఎం రేవంత్ రెడ్డికి కంటోన్మెంట్ ప్రజలు ఎల్లప్పుడు రుణపడి ఉండాలని 7వ వార్డుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత మురళీ ముదిరాజ్ తెలిపారు. కంటోన్మెంట్‌కు రూ.303కోట్లు నిధులు విడుదల చేసి నందుకు శనివారం తిరుమలగిరిలోని గాంధీ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో సిఎం రేవంత్ రెడ్డి,రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.కార్యక్రమంలో వందలా మంది కాంగ్రెస్ నాయకులు,అభిమానులు పాల్గొన్నారు.

అత్తాపూర్ డివిజన్ రాంబాగ్ మైదానంలో రెండో రోజు జరిగిన కుస్తీలో పోటీలో పాల్గొన్న రెజ్లర్లు,బిజెపి నాయకులు

కంటోన్మెంట్‌కు రూ.303 కోట్లు నిధులు విడుదల చేయడం అభినందనీయం : తెలుకుంట

సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కంటోన్మెంట్ కాంగ్రెస్ నేతలు తెలుకుంట సతీష్ గుప్త తదితరులు

కంటోన్మెంట్,నవంబర్ 16 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 303 కోట్లు కెటాయించడం అభినందనీయమని సామాజిక కార్యకర్త, సీనియర్ కాంగ్రెస్ నేత తెలుకుంట సతీష్ గుప్త తెలిపారు. కంటోన్మెంట్‌కు 303 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేసి నందుకు హర్షం వ్యక్త చేస్తూ శనివారం 5వ వార్డులోని కార్కాన చౌరస్తాలో తెలుకుంట సతీష్ గుప్త ఆధ్వర్యంలో సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తేలుకుంట మాట్లాడుతూ అభివృద్ధిలో వెనుకబడి ఉన్న కంటోన్మెంట్ బోర్డు ప్రాంతానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్,కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌లు ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు విడుదల చేయించినందుకు హర్షం వక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుజ నాగేందర్ యాదవ్, మాణిక్ ప్రభు, శ్రీనివాస్‌లు, వేణు గోపాల్‌చారి, మధు, పుష్పలతలు పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెందాలి : శైలజా రెడ్డి

కంటోన్మెంట్,నవంబర్ 16 ప్రభాతవార్త:

ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న పేద విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించిన వారికి ఇంటర్మీడియట్ చదువుతో సహాయ పడడానికి స్కాలర్‌షిప్‌లు అందజేస్తానని ఆర్యన్ పౌండేషన్ వ్యవస్తాపకురాలు, పారిశ్రామిక వేత్త శైలజా రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పికెట్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ ఎసందర్భంగా 9,10వ తరగతుల విద్యార్థులకు అవసరమైన జామెట్రీ బాక్స్‌లు, నోటు పుస్తకాలు,బ్యాగ్‌లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా శైలజా రెడ్డి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో అత్యధిక గ్రేడ్‌లు సాధించిన విద్యార్థులకు తమ స్కాలర్‌షిప్‌లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షురాలు మంజూగుప్త, సంయుక్త కార్యదర్శి ఇందిరా గుమ్మళ్లలు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో ఘనంగా లక్ష దీపోత్సవ వేడుకలు

ముత్యాలమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్,నవంబర్ 16 ప్రభాతవార్త: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని కంటోన్మెంట్ 1వ వార్డు బాపూజీ నగర్‌లోని శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో లక్షదీ పోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తులు పెద్ద సంఖయలో తరలివచ్చి దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుర్గయ్య, కరణ్ సింగ్, శ్రీకాంత్, లక్ష్మి, పద్మా, అనసూయ,మల్లమ్మ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సికింద్రాబాద్, నవంబర్ 16 ప్రభాతవార్త:

జిఎస్‌పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య శిభిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గోలి. ప్రకాష్ తెలిపారు. ఈ వైద్య శిభిరం ఆదివారం ఉదయం వారాసిగూడ పాత పోస్టాఫీస్ దారిలో ఉన్న సుజాత ఐ కేర్ సెంటర్‌లో 7.30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటలవరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో సుగర్, హెచ్‌బీ ఏ1సీ, కంటి రెటినా, డైటిషీయన్, మెడికల్ సలహాలలాంటి సేవలు ఉచితంగా అందించనున్నట్లు వివరించారు.

లింకు రోడ్ల నిర్మాణంతో ట్రాఫిక్ నియంత్రణ తగ్గించవచ్చు : ఎమ్మెల్యే వివేకానంద

పేట్ బషీరాబాద్, నవంబర్ 16, ప్రభాతవార్త

హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ఆర్డిసిఎల్) లింక్ రోడ్ల నిర్మాణంలో భాగంగా 29 కోట్ల రూపాయలతో చేపడుతున్న ఫాక్స్ సాగర్ - రాంరెడ్డి నగర్ ఇండస్ట్రీయల్ ఏరియా లింక్ రోడ్డు పనులను ఎమ్మెల్యే కెపి వివేకానంద హెచ్ఆర్డిసీఎల్ అధికారులతో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింకు రోడ్ల నిర్మాణంతో ప్రధాన రహదారులపై వాహనాల రద్దీ తగ్గడంతో పాటు సమీప ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయి. ఈ లింకు రోడ్ల పనులలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, సుభాష్‌నగర్ డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, స్థాని

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కెపి వివేకానంద

క నాయకులు ఇస్మాయిల్, హెచ్ఆర్డిసిఎల్ సీఈ శ్రీనివాస్, ఈఈ విజయ్ కుమార్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ సురేందర్‌రెడ్డి, న్యాక్ ఇంజనీర్ జయశ్రీ, విజయ్ కుమార్, విట్టలయ్య, హెచ్ఆర్డిసిఎల్ అధికారులు జెరేమయ్య, విజయ్ కుమార్‌లు పాల్గొన్నారు.

నకిలీ కరెంట్ వైర్లు తయారు చేస్తున్న ముఠా అరెస్ట్

బేగంబజార్,నవంబర్ 16ప్రభాతవార్త:

అక్రమంగా తయారు చేస్తున్న నకిలీ కరెంట్ వైర్లు ముఠాను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకుని అబిడ్స్ పోలీసులకు అప్పగించారు.ట్రూప్‌బజార్‌లో అక్రమంగా బ్రాండ్ నేమ్‌తో పేరుతో నకిలీ కరెంట్ వైర్లు తయారు చేసునతన్న ముఠాపై సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 15లక్షల విలువైన నకిలీ వైర్లను స్వాధీనం చేసుకుని నిందితులను పట్టుకున్నారు. విచారణ నిమిత్తం నిందితులను నకిలీ వైర్లతోపాటు అబిడ్స్ పోలీసులకు అప్పగించారు.ఈకేసును అబిడ్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పురుషోత్తం గుప్తకు నివాళి

అఫ్జల్‌గంజ్,నవంబర్ 16ప్రభాతవార్త: ప్రముఖ సంఘ సేవకులు పి.పురుషోత్తం గుప్త ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో నగరంలో వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.ముందుగా పురుషోత్తం చిత్రపటానికి గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి,శాసనమండలిసభ్యులు బొగ్గారపుదయానంద్‌గుప్త,మాజీ మేయర్ బొంతు రామ్మోహన్,మాజీ శాసనసభ్యులు ప్రేమ్ సింగ్‌రాథోడ్,మాజీకార్పొరేటర్లు పి.మమత సంతోష్‌గుప్త, పరమేశ్వరిసింగ్.ఎం.శంకర్‌యాదవ్,తెలంగాణ ఉద్యమ నాయకులు ఆర్వీ మహేందర్‌కుమార్,తదితరులు పాల్గొన్ని పూలమాలలు వేసి నివాళ్లు ఆర్పించారు.ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌కు రూ. 303 కోట్లు : జంపన

బోయిన్‌పల్లిలో సిఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు జంపనప్రతాప్, ముప్పిడి మధుకర్ తదితరులు

కంటోన్మెంట్,నవంబర్ 16 ప్రభాతవార్త:

కంటోన్మెంట్ చరిత్రలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.303 కోట్లు నిధులు విడుదల చేసిన ఘనత సిఎం రేవంత్ రెడ్డికే దక్కిందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. కంటోన్మెంట్ బోర్డుకు 303 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదల చేసి నందుకు బోయిన్‌పల్లి చౌరస్తాలో సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు ముప్పిడి మధుకర్, ఆర్.ఆనంద్ బాబు, బల్వంత్ రెడ్డి, హరిక్రిష్ణ, అజయ్, సదానంద్, ముఖేశ్ యాదవ్, మారుతీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

షాపూర్‌నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

పేట్ బషీరాబాద్, నవంబర్ 16, ప్రభాతవార్త

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, షాపూర్‌నగర్‌లో గల హాస్పిటల్‌ని మేడ్చల్ మల్కాజగిరి డిసిసి ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్, ఆల్ ఇండియా దళిత సే అధ్యక్షులు డాక్టర్ జేమ్స్‌లు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సంబంధిత డాక్టర్ నవనీతని కలిసి హెల్త్ సెంటర్ పనితీరుపై తెలుసుకోవడం జరిగింది. పేషెంట్స్‌కు సరిపడా ఔషధాలు సరిగా వస్తున్నాయని తెలుసుకొనగా అన్ని బాగానే ఉన్నాయని తెలిసింది. గత కొద్ది రోజులుగా ఆంటీరాబిస్ ఇంజక్షన్స్ కొరత ఉంది. ఇతర ప్రభుత్వ హాస్పిటల్‌లో కూడా కొరత ఉందని తెలియడంతో ఎంక్వయిరీ కోసం షాపూర్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కి వెళ్లడం జరిగింది. అక్కడ డాక్టర్‌ని సిబ్బంది అడిగిన తర్వాత గత కొద్ది రోజులుగా ఇంజక్షన్లు రావడంలేదని, ఆర్డర్ పెట్టి ఎనోనన రోజులైందని తెలియడంతో సంబంధిత జిల్లా అధికారులు సంప్రదించగా.. జిల్లా ఆసుపత్రి నుండి సప్లై చేసే వ్యక్తి లీవ్‌లో ఉన్నాడని తెలిసింది. ఈ విషయమై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోగా సోమవారం నుండి ఆంటీరాబిస్ ఇంజక్షన్లతోపాటు కొరత ఉన్న మందులన్నీ కూడా ప్రతి బ్రాంచ

ఎల్‌బినగర్‌లో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు : ఈటల, దేవిరెడ్డి

శ్రీ పురం కాలనీలో పార్క్ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎం.పి. ఈటల, ఎమ్మెల్యే దేవిరెడ్డి,కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

వనస్థలిపురం. నవంబర్ 16.ప్రభాతవార్త : ఎల్.బి.నగర్ నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడతామని మల్కాజిగిరి ఎం. పి. ఈటల రాజేందర్,ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి లు పేర్కొన్నారు.బి.యన్.రెడ్డి,నగర్ డివిజన్ లో సుమారు 1కోటి 27 లక్షల తో అభివృద్ధి పనులకు శనివారం ఎం.పి.,ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తో కలిసి శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. హరిహారపురం కాలనీలో 46.5 లక్షల తో సి.సి.రోడ్డు కు శంకుస్థాపన, శ్రీ రాంనగర్ కాలనీలో 26 లక్షల తో నిర్మించిన సి.సి.రోడ్డు, శ్రీపురం కాలనీలో ఫేస్ 2 లో 54.2 లక్షల రూపాయల తో నిర్మించిన పార్క్ అభివృద్ధి పనుల కు ఎం. పి. ఎమ్మెల్యే, కార్పొరేటర్ లు ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బి.జె.పి నాయకులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ బి.ఆర్.ఏస్., బిజెపి, అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి ,కొంతం నవకిషోర్ రెడ్డి, బాకరం నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, విజయభాస్కర్, హనుమంతు రెడ్డి,నారాయణ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, విట్టల్ రెడ్డి, జ్ఞానేశ్వర్ గౌడ్,రవిశంకర్,శంకర్ గౌడ్ పొగుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరాంజనేయ స్వామికి లక్ష తమలపాకుల పూజ



పూజల్లో పాల్గొన్న భక్తులు

హుడా కాంప్లెక్, 16 నవంబర్ ప్రభాతవార్త: సరూర్ నగర్ డివిజన్ లోని వెంకటేశ్వర కాలనీ, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో 40వ బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం శ్రీ వీరాంజనేయ స్వామికి లక్ష తమలపాకుల నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని స్వామీ వారి ఆశీస్సులు పొందారు. అనంతరం తీర్థ , ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరుపొలు భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతి ప్రసాద్, మాజీ చైర్మన్ గండు ధనం రెడ్డి, కమిటీ సభ్యులు బొగేశ్వర్ రావు, సుబ్బరావు, శ్రీనివాస్ రావు, ప్రతాప్ రెడ్డి, మహేందర్, ఆలయ సభ్యులు రవీందర్ రావు, వీరేందర్ రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి కనకరావు, ఉపాధ్యక్షుడు మారోజు శ్రీనివాస చారి,అర్చకులు కృష్ణమాచార్యులు, వంశధార చార్యులు, రామకృష్ణమా చార్యులు,శ్యాంసుందర్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమాన్ని కృషి -మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పుష్పగుచ్చలను అందజేసి అభినందనలు తెలియజేస్తున్న చిలుక నరసింహారెడ్డి, ఎస్‌జిఎస్ దామోదర్ తదితరులు

మలక్ పేట ,నవంబర్ 16, ప్రభాతవార్త : ఉద్యోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమాన్ని కృషి చేస్తామని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.టీఎన్ జి ఓ మార్కెట్ కమిటీ ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలుక నరసింహారెడ్డి, కార్యదర్శి ముక్రం ,కార్యవర్గ సభ్యులు ఎస్ జి ఎస్ దామోదర్ ల ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులతో కలిసి సచివాలయానికి తరలి వెళ్లి వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వ కలిసి పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎస్ వెంకన్న, ఉద్యోగులు సంతోష్, ఎల్. శ్రీనివాస్ రెడ్డి, కాలిద్ తదితరులు పాల్గొన్నారు.

హరి హర క్షేత్రంలో ఘనంగా పూజా కార్యక్రమాలు

మలక్‌పేట, నవంబర్ 16, ప్రభాతవార్త: మలక్ పేట పట్లన్ లోని శ్రీహరి హర క్షేత్రంలో కార్తీక పౌర్ణమి పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి.భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు . అదేవిధంగా దేవాలయంలో రాత్రి భక్తులు అధిక సంఖ్యలో హాజరై పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తిశ్రద్ధలతో దీపారాధన కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ సూగూరు రమేష్,ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మార్తాండ రావు, ఆలయ అర్చకులు మంగళగిరి శ్రీనివాసాచార్యులు, కాసుల చంద్రశేఖర శర్మ, సభ్యులు సరాపు శ్రీహరి , వనం సత్యేందర్ ,రేణు అగర్వాల్, పారిజాతా రెడ్డి, శెట్టి విజయ్ కుమార్, రొడ్డ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వినతి

హయత్‌నగర్, నవంబరు 16 ప్రభాతవార్త: ప్రజా ప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారుల అండదండలతో ఎల్.బి.నగర్ నియోజకవర్గంలో పెరిగిపోతున్న అక్రమ నిర్మాణాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి ఆధ్వర్యంలో శనివారం జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సామాన్యుడు 100 గజాల్లో ఇల్లు కట్టుకుంటే అనుమతులు లేవని చెబుతూ ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులు చోటామోటా లీడర్లు అక్రమంగా వెలుస్తున్న బహుల అంతస్థులు, భారీ షెడ్లపై నోరు మెదపకపోవడానికి కారణమేమిటన్నారు. అక్రమ నిర్మాణాల నుంచి మామూళ్లు వసూలు చేసుకుంటూ వారికి వంతపాడుతున్నారని మండిపడ్డారు. హయత్‌నగర్, మన్సూరాబాద్, వనస్థలిపురం, నాగోల్ డివిజన్లలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేలా చూడాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో సీపీఐ హయతనగర్ మండల కమిటీ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వివేకానంద యువక్ సంఘ్ కమిటికి చేయూత : ఎమ్మెల్యే

ఉప్పల్, నవంబరు 16 ప్రభాతవార్త : చిలుకానగర్ స్వామి వివేకానంద యువక్ సంఘ్ కమిటి అభివృద్ధికి తన వంతు చేయూత అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం స్వామి వివేకానంద యువక్ సంఘ్ కమిటి అధ్యక్షుడు ఈరెల్లి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇంద్రాల రమేష్, పౌండర్స్ కటకం శ్రీకాంత్, ఠాకూర్ ఉమేష్‌సింగ్, కటకం సంజయ్, అడ్వయిజర్లు ముక్కాల రామకృష్ణ, చిల్వేరు సత్యనారాయణ, సకినాల ప్రసాద్, మహేందర్‌రెడ్డి, ఆలే నరేంద్ర, శరత్ బాబు, లక్ష్మణ్‌గౌడ్, ప్రకాష్, నరేష్, అఖిల్, మహేష్, బోయ రమేష్ తదితరులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసి సత్కరించారు.

సహకార సంఘాలతో విస్తృతంగా ఉపాధి అవకాశాలు : డిప్యూటీ రిజిస్ట్రార్ రోజా రాణి

మలక్ పేట నవంబరు 16, ప్రభాతవార్త : సహకార సంఘాలతో విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని గోల్కొండ కోఆపరేటివ్ సొసైటీ డిప్యూటీ రిజిస్ట్రార్ టీ .రోజా రాణి, గన్ ఫౌండ్రి కో ఆపరేటివ్ సొసైటీస్ జాయింట్ రిజిస్ట్రార్ ఆర్. సంగీత, నాంపల్లి కో ఆపరేటివ్ సొసైటీస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎల్. శారదాంబ లు పేర్కొన్నారు. 71 వ జాతీయ కోఆపరేటివ్ వారోత్సవాలను పురస్కరించుకుని తిరుమల బ్యాంక్ ఫౌండర్ చైర్మన్ నంగునూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మలక్ పేట తిరుమల బ్యాంకు లో నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిలుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో వినియోగదారులు వెన్నెముక అని పేర్కొన్నారు. అందరూ చేయి చేయి కలిపి అభివృద్ధి చెందాలని కోరారు .బ్యాంకింగ్ రంగాన్ని తిరుమల బ్యాంక్ చైర్మన్ నంగునూరు చంద్రశేఖర్ అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని అభినందించారు. దివంగత మాజీ ప్రధాని నెహ్రూ కో ఆపరేటివ్ రంగాల కోసం చట్టాలను తీసుకోవడం జరిగిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో లక్షలాది సహకార సంఘాలు ఉన్నాయని తెలిపారు. బ్యాంక్

సమావేశంలో ప్రసంగిస్తున్న డిప్యూటీ రిజిస్ట్రార్ టీ.రోజా రాణి, చిత్రంలో చైర్మన్ నంగునూరు చంద్రశేఖర్ తదితరులు

చైర్మన్ నంగునూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ నమ్మకం, విశ్వసనీయత ఎంతో ముఖ్యమైనవని, వినియోదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. కృషి, పట్టుదల, దీక్ష ఉంటేనే విజయం సాధిస్తామని తెలిపారు. అనంతరం డాక్టర్ బాలసుబ్రమణ్య శర్మ ఆలపించిన గీతాలు అందరిని అలరించాయి.ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రవిశంకర్, పలువురు వినియోగదారులు, వాణి గ్రామర్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దశలవారిగా సమస్యలను పరిష్కరించి ఇబ్బందులను తొలగిస్తాం



అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎంపీ, ఎమ్మెల్యే, కార్పొరేటర్‌తో నాయకులు

హయత్‌నగర్, నవంబరు 16 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని... దశలవారిగా వాటిని పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెలరాజేందర్, ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని సూర్యనగర్‌లో 1.40 కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న సీసీరోడ్లు, ఇన్ఫర్మేషన్ కాలనీ, సత్యనారాయణకాలనీ, వెంకటేశ్వరకాలనీ, మహాగాయత్రి నగర్ నుంచి కుమ్మరికుంట వరకు 1.67 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న సీసీరోడ్లు, సుష్మాసాయినగర్ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్థులో 19 లక్షల రూపాయలతో నిర్మించనున్న మహిళా భవన్‌కు వారు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమస్యల తీవ్రతను బట్టి నిధులను కేటాయిస్తూ అభివృద్ధి పనులను పూర్తిచేస్తామన్నారు. కాలనీ అసోసియేషన్లు అభివృద్ధి పనుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని నాణ్యతాలోపాలు కనిపిస్తే వెంటనే తమకు, అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కళ్లెం రవీందర్‌రెడ్డి, చెన్నగోని శ్రీదర్‌గౌడ్, ఉగాది ఎల్లప్ప, మల్లేష్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి: పీడీఎస్‌యూ

హయత్‌నగర్, నవంబరు 16 ప్రభాతవార్త: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్సుమెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యు)రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, రిటైర్డ్ ప్రిన్సిపల్ జి.అనసూయ డిమాండ్ చేశారు. హయత్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలవుతున్నా నేటికి విద్యారంగ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించలేదన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదలలో ఆలస్యం కారణంగా పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఫీజులు కట్టే డబ్బులేక విద్యార్థులు వేధింపులకు గురవుతున్నారని, చిన్నతరహా ప్రైవేటు డిగ్రీ కళాశాలు మూతపడుతున్నాయన్నారు. ఇప్పటికే ఇంటర్మీడియెట్ విద్యావిధానం పూర్తిగా కార్పొరేట్ కబంధ హస్తాలలోకి వెళ్లిందని, డిగ్రీ కళాశాలలకు కూడా అదే దుస్థితి వస్తుందన్నారు. ప్రభుత్వం పెంచినట్లుగా చెబుతున్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలు సరిపోవడం లేదన్నారు. నగరంలోని ప్రభుత్వ విద్యా సంస్థలు, కళాశాలలు, యూనివర్సిటీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయని ఆరోపించారు. ప్రైవేటు ఫీజు దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ విద్యాసంస్థలలో చదివే విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లను అందించాలని డిమాండ్ చేశారు. సామాజిక సృహను పెంచుకుని విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ జ్వాలా వెంకటేశ్వరరావు, పీడీఎస్‌యూ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు రహీమ్, జీవన్ పాల్గొన్నారు.

తార్నాక చౌరస్తాలో రోడ్డు ఆక్రమ కట్టడాన్ని కూల్చివేసిన జిఎచ్ఎంసి అధికారులు

తార్నాక, నవంబర్ 16 ప్రభాతవార్త: తార్నాక చౌరస్తాలో రోడ్డు పై వెలసిన ఆక్రమ కట్టడాన్ని జీఎచ్ఎంసీ అధికారులు శనివారం కూల్చివేశారు. దీంతో స్థానికులు జీఎచ్ఎంసీ అధికారుల పనితీరుపట్ల హర్షం వ్యక్తం చేశారు. గత కొన్ని నెలల క్రితం తార్నాక చౌరస్తాలో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ యజమాని అక్రమంగా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి దానిని ఎత్తుగా ఏర్పాటు చేసుకొని నిర్మాణాలు చేపట్టాడు. దీంతో అదికారులు తొలగించారు. తార్నాక జంక్షన్ విస్తరణలో భాగాంగా జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ బి.వీ.యస్.పేర్రాజు ఆధ్వర్యంలో ఈ కూల్చివేతలు సాగాయి.రెండు జేసీబీల సహాయంతో కూల్చివేతలను చేపట్టారు. ఈ కూల్చివేతలను అడ్డుకునేందుకు బంక్ యజమాని ప్రయత్నించి జీహెచ్ఎంసీ సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. ప్రభుత్వ నిభందనల మేరకే కూల్చివేతలను చేపట్టామని ఈఈ పేర్రాజు చెప్పారు. ఫుట్‌పాత్‌ను ఆక్రమించడంతో నిర్మాణాన్ని తొలగించామన్నారు. ప్రజలు, వాహనాలకు అసౌకర్యంగా ఉన్న నిర్మాణా

తార్నాక చౌరస్తాలో ఫుట్‌పాత్‌ను ఆక్రమణను కూల్చివేస్తున్న జీఎహెఎంసీ అధికారులు

లను ఖచ్చితంగా కూల్చివేస్తామని ఆయన హెచ్చరించారు. ఫుట్‌పాత్ ఆక్రమణలతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని నివారించేందుకు ఫుట్‌పాత్‌లపై అక్రమనిర్మాణాలను తొలగిస్తున్నామని ఈఈ వెల్లడించారు.

అభయాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

విగ్రహ ఏర్పాటులో పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, నవంబరు 16 ప్రభాతవార్త : రామంతాపూర్ శ్రీనగర్ కాలనీలోని శ్రీ భక్త అంజనేయస్వామి ఆలయంలో 15 అడుగుల అంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శ్రీ భక్త అంజనేయస్వామి ఆలయంలో ఆభయ అంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విగ్రహం ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. విగ్రహం ఏర్పాటుకు ముందుకు రావడం పట్ల కమిటి నేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు తౌఫిక్, మేడిపల్లి వినయ్ రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, వల్లపు శ్రీకాంత్‌యాదవ్, ముత్యాల బాబు, శాగ శ్రీధర్, ఆలయ కమిటి నేతలు ఆనందరావు, రాజేందర్ గైక్వాడ్, రాజమౌళి, యాదగిరిరెడ్డి, సత్యనారాయణ, బ్రహ్మం, పరియాద రాజు, పెంటయ్య,ఉదయ్‌కుమార్, రాజ మల్లు, జంగారెడ్డి, సునీల్‌కుమార్, సురేష్, జి.కృష్ణ, రాములు, జిల్లు, జంగయ్య, ప్రవీణ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ,మంచినీటి సమస్యల పరిష్కారం కోసం జీఎంకు వినతి

జలమండలి జీఎం సంతోష్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

నాచారం, నవంబర్ 16 ప్రభాతవార్త: నాచారం డివిజన్‌లోని పలు భూగర్భ డ్రైనేజీ, మంచినీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం జలమండలి జీఎం సంతోష్‌కు కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేకర్ వినతిపత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా భవానినగర్ స్ట్రీట్ నెం.3, విఎస్‌టీ కాలని తధితర కాలనీల్లో సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులకు నిధులు మంజూరయ్యాయని డ్రైనేజీ సమస్య వల్ల రోడ్డు పనులు చేపట్టలేక పోతున్నామని జీహెచ్ ఎంసి అదికారులకు వినతిత్రాన్నా అందజేశారు. తక్షణ మే రెండు వీధుల్లోని భగర్భడ్రైనీజీ నిర్మాణం పనులకు నిధులను మంజూరు చేయాలని జలమండలి జీఎం సంతోష్‌కు విజ్ఞప్తి చేశారు.

జిఓ 60ని అమలు చేయాలని వినతి

సరూర్‌నగర్, నవంబర్ 16 ప్రభాతవార్త: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జిఓ 60ని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సంఘం కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి కమీషనర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం ఆయన తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ బాలాపూర్ మండల నాయకులు ఎ.వెంకట రమణారెడ్డి, ఎం.నరేందర్ ల ఆధ్వర్యంలో ఆయన కమీషనర్ జ్ఞానేశ్వర్‌ను కలిసి ఒక వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ కార్మికులకు వేతనాలకు సంబంధించిన జిఓ 60 అమలు కావడం లేదని అన్నారు. ప్రభుత్వం 2021లో విడుదల చేసిన జిఓ ప్రకారం వేతనాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ మేరకు స్పందించిన కమీషనర్ ఈ జిఓ విషయన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తానని వారికి హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కార్మికులు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో పేదల ఇళ్లను పూర్తి చేయించాలని జిల్లా సమావేశంలో మేయర్ వినతి

సమావేశంలో సమస్యలు ప్రస్తావిస్తున్న మేయర్ పారిజాత

సరూర్‌నగర్, నవంబర్ 16 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మల్లాపూర్‌లో పేదల కోసం జరిగిన ఇళ్ళ నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయనీ ఈ నేపథ్యంలో వాటిని పూర్తి చేయడానికి అవసరమయ్యే నిధులు కేటాయించాలని స్థానిక మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో కోరారు. శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి, చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పలువురు అదనపు కలెక్టర్లు, జిల్లా ఉన్నతాధికారులు హాజరైన ఈ సమావేశంలో ఆమె ఆమె మల్లాపూర్ అసంపూర్తి పేదల ఇళ్ళను ప్రస్తావించారు. అదే విధంగా కార్పొరేషన్‌కు మూడు అంగన్‌వాడి కేంద్రాలను మంజూరు చేయాలని కోరారు.

సుష్మాసాయి నగర్‌లో మహిళా భవనానికి శంకుస్థాపన

వనస్థలిపురం. నవంబర్ 16.ప్రభాతవార్త : హయత్ నగర్ డివిజన్ పరిధిలోని సుష్మా సాయినగర్ లో కమ్యూనిటీ భవనం పై 16 లక్షల రూపాయల తో నిర్మించనున్న మహిళా మండలి భవనానికి మల్కాజిగిరి ఎం.పి.ఈటల రాజేందర్,ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి లు స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బి.ఆర్.ఎస్. అధ్యక్షుడు, చెన్నగౌని శ్రీధర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి,కాలనీ ప్రతినిధులు గుత్తా లక్ష్మన్ రెడ్డి,భీమిడి మహేందర్ రెడ్డి, నర్సి రెడ్డి,వెంకట్ రెడ్డి,మహిళా మండలి అధ్యక్షురాలు శిల్ప, ప్రధాన కార్యదర్శి ప్రవీన పాల్గొన్నారు.

చర్చి మరమ్మతుల కోసం విరాళం అందజేసిన ఉపేందర్

ఎల్.బి.నగర్, నవంబర్ 16 ప్రభాతవార్త: ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ ఫేజ్ 1లోని బాప్టిస్ట్ చర్చి మరమ్మతుల కోసం రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి చర్చి నిర్వాహకులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వాసవికాలనీలోని ఆయన నివాసంలో చర్చి నిర్వహకులకు రూ.25 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ సమీపిస్తున్న నేపథ్యంలో మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో చర్చి అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చర్చ్ ప్రెసిడెంట్ జాషువా, సెక్రటరీ లింకాన్, కోశాధికారి రమేష్, అశోక్, శశి, జహంగీర్, రాజు, అనిల్ పాల్గొన్నారు.

కన్యాకాపరమేశ్వరి దేవాలయంలో లక్షదీపోత్సవం

కార్తీకదీపంలో పాల్గొన్న మహిళలు

ఎల్.బి.నగర్, నవంబర్ 16 ప్రభాతవార్త: ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని కన్యాకాపరమేశ్వరి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా కార్తీక లక్షదీపోత్సవ వేడుకలు నిర్వహించారు. లక్షదీపోత్సవం వేడుకలలో వందలాది మంది మహిళలు పాల్గొని పరమ శివున్ని తలుచుకుంటూ కార్తీక దీపాలను వెలిగించారు. దీంతో దేవాలయం పరిసర ప్రాంతాలు దీపాల వెలుగులతో నిండిపోయాయి. ఈ కార్యక్రమంలో వాసవికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరీశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, కార్యదర్శి అయిత అంజయ్యగుప్తా, కోశాధికారి కృష్ణయ్య, కన్వీనర్ తమ్మన శ్రీధర్, గౌరిశెట్టి అరుణ్, సుదర్శన్, చిలుక మధురఉపేందర్‌రెడ్డి, సుజాత, అరుణ, పద్మ, డాక్టర్ సంతోషిని, లక్ష్మి పాల్గొన్నారు.

నడక ప్రాధాన్యతో తెలియజేస్తూ నేడు 4కె రన్

ఎల్.బి.నగర్, నవంబర్ 16 ప్రభాతవార్త: నడక ప్రాధాన్యతను తెలియజేయడంతో పాటు ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడానికి నడక ఎంతగానో ఉపయోగపడుతుందని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తెలిపారు. నడక ప్రాధాన్యతను గురించి ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6 గంటలకు 4కె రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఫోర్ కె రన్ వాసవి కాలనీ నుండి ప్రారంభమై ఎల్బీనగర్ మీదుగా వాసవి కాలనీలోని ఆధ్యాత్మిక కేంద్రం వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. సుమారు 400 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుచైతన్య పరుస్తారని వారు పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి : పవన్



కబ్జా స్థలం

ఎల్.బి.నగర్, నవంబర్ 16 ప్రభాతవార్త: కొత్తపేట డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 135లోని ప్రబుత్వ స్థలము గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేశారని వెంటనే ఈ ప్రబుత్వ స్థలాన్ని కాపాడాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రబుత్వ స్థలాన్ని కాపాడాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు. అదేవిధంగా డివిజన్ పరిధిలో వున్న ప్రబుత్వ స్థలాలను గుర్తించి ప్రబుత్వ స్థలం బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు, చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. అందుకు స్పందించిన జాయింట్ కలెక్టర్ వెంటనే ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేశార